ఉపాధ్యాయుడిపై దాడి హేయం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సాహితీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కొండారెడ్డిపై గొంట్ల గణేష్ అనే విద్యార్థి బ్లేడుతో దాడి చేయడం హేయమైన చర్యగా భావించి అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యం నిర్వాహకులు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబును పట్టణంలోని ఆయన నివాస గృహంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం గిద్దలూరు సర్కిల్ కార్యాలయంలో సీఐ కె.దేవప్రభాకర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల మంచి కోరుతారే తప్ప హాని కలిగించరని ప్రతి విద్యార్థి గుర్తించాలన్నారు. ఉపాధ్యాయుడి పై దాడి చేసిన గణేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల ప్రతినిధులు కె.రాజు, జింక చంద్రశేఖర్, గణేష్, నాగేశ్వరరెడ్డి, ఖాజావలి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అన్నాకు వినతిపత్రం అందజేస్తున్న విద్యాసంస్థల ప్రతినిధులు

బెల్ట్‌షాపులు నడిపితే చర్యలు

- ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

మార్కాపురం: బెల్ట్‌షాపులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఎస్పీ అంకితా సురానా హెచ్చరించారు. శుక్రవారం రాయవరం రైల్వేస్టేషన్ పరిధిలో ఫ్లెట్లైవర్ కింద నిర్వహిస్తున్న బెల్టుషాపులపై ఆమె దాడులు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు పాల్పడితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. పేకాట, బెల్టుషాపుల నిర్వాహకులపై ఉపేక్షించేదిలేదని చెప్పారు. ఆమె వెంట రూరల్ ఎస్ఐ సుమన్ ఉన్నారు.


దాడుల్లో ట్రైనీ ఎస్పీ అంకితా సురానా

నేడు సచివాలయం ప్రారంభం

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడులో సచివాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అన్నా రాంబాబు ప్రారంభించనున్నట్లు సర్పంచ్ జిల్లెల మహాలక్ష్మమ్మ తెలిపారు. సచివాలయ ప్రారంభోత్సవం అనంతరం జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవం ఉంటుందని, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

దర్శి: పట్టణంలోని పొదిలి రోడ్డులో 23/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ప్రసాద్ తెలిపారు. పొదిలి రోడ్డు, కొత్తరెడ్డిపాలెం, కురిచేడు రోడ్డు, శివరాజనగర్, చౌటపాలెం రోడ్డు, లంకోజనపల్లి, వెంకటాపురం, చింతల పాలెం, వీరాయపాలెం, చౌటపాలెం, శామంతపూడ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

వరిగడ్డి వామి దగ్ధం

కొమరోలు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వరిగడ్డి వామి దగ్ధమైంది. ఈ సంఘటన స్థానిక చెక్‌పోస్టు వద్ద శుక్రవారం జరిగింది. పోరుమామిళ్ల నుంచి పశువుల మేత కోసం పశుపోషకుడు శ్రీను ట్రాక్టర్‌పై వరిగడ్డి వామిని రూ.12 వేలకు కొనుగోలు చేసి కొమరోలు తీసుకొస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు వరిగడ్డి వామికి తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ ట్రాక్టర్‌ను దూర ప్రాంతానికి తీసుకెళ్లి ఆపాడు. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో వామి పూర్తిగా దగ్ధమైంది.

మహిళల భద్రతపై ప్రత్యేక నిఘా


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణపావని

రాచర్ల: మహిళల భద్రతపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తానని ఎస్ఐ జి.కృష్ణపావని అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సచివాలయ మహిళ పోలీసులతో శుక్రవారం ఆమె ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు వివిధ సమస్యలతో బాధపడుతున్నా వారు ఎలాంటి భయం లేకుండా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. మెట్టమొదటి సారిగా రాచర్ల మండలానికి మహిళా ఎస్ఐగా జి.కృష్ణపావని రావడంతో మండలంలోని డ్వాక్రా మహిళలు, సచివాలయ మహిళా పోలీసులు వచ్చి ఆమెను ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

కంభం: పాఠశాలల ఉపాధ్యాయులు సమూహాలుగా ఏర్పడి వారి వారి అనుభవాలు పంచుకోవడం ద్వారా నైపుణ్యాలు అభివృద్ధి పరుచుకునేందుకు కాంప్లెక్స్ సమావేశాలు ఉపయుక్తంగా ఉంటాయని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి, ప్రాథమికోన్నత స్థాయి సముదాయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిలా, నిత్యం వెలిగే దీపంలా ఉంటూ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు సరోజ, సముదాయ కార్యదర్శులు జి.శ్రీనివాసులు, అంకిరెడ్డి, సీఆర్పీ మురళి, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రుడి సేవలు మరవలేనివి


రామచంద్రుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా

రాచర్ల: అరిగెల రామచంద్రుడు సేవలు మరవలేనివని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని అనుములపల్లె జీవనమూర్తిస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌శాఖ ఏఈగా విధులు నిర్వహిస్తున్న అరిగెల రామచంద్రుడు పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు పదవీ విరమణ చేయడం సహజమన్నారు. అనంతరం అరిగెల రామచంద్రుడు ఘనంగా సన్మానం చేశారు. నెమలిగుండ్లరంగనాయకస్వామి చైర్మన్ కన్నసాని ఓబులేసు, సర్పంచులు సిగిరిగి రమేష్, పల్నాటి లతీఫ్, పగడాల రమేష్, లక్ష్మీదేవి, పగడాల శ్రీరంగం, ఎస్ఐ జి.కృష్ణపావని పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై తహసీల్దార్‌కు వినతి

గిద్దలూరు రూరల్: పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ డి.సీతారామయ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెరుగుదలను, సర్దుబాటు చార్జీల భారాలను సీపీఎం వ్యతిరేకిస్తోందన్నారు. ప్రజలను ఆర్థికంగా ఇబ్బందికి గురిచేసే విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు నరసింహులు, మూర్తి, థామస్, బాబూరావు, లక్ష్మీనారాయణ, మార్కు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి

దొనకొండ: ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ కమిటీ సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు.

ఓటర్ల జాబితాలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

త్రిపురాంతకం: ఓటర్ల జాబితాలో సవరణలు, చేర్పులకు బీఎల్‌ఓలు తమ పరిధిలో అవగాహన కల్పించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. చెన్నయ్య పేర్కొన్నారు. త్రిపురాంతకంలో బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువకులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు అవగాహన కల్పించాలన్నారు.

ఓటరు జాబితా సవరణలపై సమీక్ష

కురిచేడు: ఓటరు జాబితాపై సవరణలు, చేర్పులు, మార్పులపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. నియోజకవర్గ ఎలక్టోరల్ యంపీ ఎస్. లోకేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నలుగురు జూదరులకు జైలు

మార్కాపురం టౌన్: మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామ శివార్లలో ఈ నెల 28న పేకాట ఆడుతూ పట్టుబడ్డ నలుగురు పేకాట రాయుళ్లకు శుక్రవారం మార్కాపురం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ 4 రోజుల జైలుశిక్ష, రూ.300 జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు రూరల్ ఎస్ఐ సుమన్ తెలిపారు. ఈ నెల 28న గజ్జలకొండ గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని ట్రైనీ ఎస్పీ అంకితా సురానా ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. వారి నుంచి రూ.2.50 లక్షల నగదు, 3 బైకులు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేవలం 2 రోజుల వ్యవధిలోనే వారిని కోర్టులో హాజరుపరుచగా ఒక్కొక్కరికి 4 రోజుల జైలు శిక్ష, 300 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఐఐటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం

గిద్దలూరు రూరల్: ఐఐటీలో ప్రతిభ కనబరిచి ఆల్ ఇండియా 740 ర్యాంక్ సాధించిన ఎస్ షానవాజ్ విద్యార్థికి ప్రజాస్వామ్య శాంతి సేవా సంఘం కార్యాలయంలో శుక్రవారం సన్మానం చేశారు. నిర్వాహకుడు మహబూబ్‌పీరా మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో విద్యను అభ్యసించాలన్నారు. షానవాజ్ వంటి విద్యార్థులను తోటి విద్యార్థులకు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థి తండ్రి రఫీ, నిర్వాహకులు మల్లారెడ్డి, ఆదినారాయణరెడ్డి, బాలయ్య, రాజశేఖర్, ఆజాద్ పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలకు వీల్‌చైర్ అందజేత


వీల్‌చైర్ అందజేస్తున్న సభ్యులు

మార్కాపురం టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మార్కాపురంలోని జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్బారెడ్డికి వీల్‌చైర్ అందించారు. వైద్యశాలకు వచ్చే పలువురు దివ్యాంగులు, క్షతగాత్రులు వైద్యశాలలో చేరి చికిత్స కోసం వివిధ వార్డులకు వెళ్లేటప్పుడు వీల్ చైర్ లేక ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి రావడంతో సంస్థ తరఫున కనిగిరి అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసరావు సహకారంతో అందజేసినట్లు అధ్యక్షురాలు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి తెలిపారు. సభ్యులు కృష్ణారావు, పి.రాధాకృష్ణమూర్తి, శ్రీనివాస సింగ్, వలి, దాసు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి సన్మానం


ఏలియాను సన్మానిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పెద్దదోర్నాల: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఏలియా శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఏలియా సేవలను సహచర ఉద్యోగులు కొనియాడారు. ఏఈ నాగేంద్రరెడ్డి, ఎల్ఐ ప్రసాద్, సబ్ ఇంజినీర్ చెన్నకేశవులు, సిబ్బంది ఏలియాను ఘనంగా సన్మానించారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం


పనులు చేయిస్తున్న బాబూరావు

దర్శి: నగర పంచాయతీ పరిధిలోని ఐదో వార్డులో లోఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ఎస్సీ కాలనీ, నాయుడు బజారు, వడ్డెర బజారులలో కేబుల్ వైరులు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 5వ వార్డు కౌన్సిలర్ తాళ్లూరు బాబూరావు దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో బాబురావు వెంటనే ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దృష్టికి విషయం తీసుకువెళ్లి 10 విద్యుత్ స్తంభాలు, మూడు ఫేజ్ కండక్టర్‌లు, వైరు బిగించి ఆప్రాంత వాసులకు విద్యుత్ సమస్యలు లేకుండా చేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, వార్డు కౌన్సిలర్ బాబురావు, విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగులు..ఒకరికొకరు తోడుగా..


బేరింగ్ సైకిల్‌పై శ్రీనుతో ఆంజనేయులు, నరసింహారావు

పొదిలి: దివ్యాంగులు ఒకరికొకరు తోడుగా ఉంటూ మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలు.. మార్కాపురం మండలం రాయవరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు ఎలగాల శ్రీను భిక్షాటన చేస్తుంటాడు. సకాలంలో ఆన్‌లైన్లో పేరు నమోదు చేసుకోక పోవడంతో ట్రైసైకిల్ పొందలేక పోయాడు. వైస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం మండల శాఖ అధ్యక్షుడు దేవళ్ల ఆంజనేయులను శ్రీను సంప్రదించాడు. ఆంజనేయులు తన సొంత నిధులతో బేరింగ్ సైకిల్ పాతది కొనుగోలు చేసి శ్రీనుకు ఇచ్చాడు. దివ్యాంగులు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో సెమినార్


మాట్లాడుతున్న వెన్నా హనుమారెడ్డి

మార్కాపురం: సమాజానికి ఉపయోగపడే పరిశోధనలను ఇంజినీరింగ్ విద్యార్థులు చేపట్టాలని వీహెచ్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో సైన్స్ అండ్ టెక్నాలజీలో అత్యాధునిక పద్ధతులు అంశంపై రెండు రోజుల నుంచి జరుగుతున్న జాతీయస్థాయి సెమినార్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా, యంత్రాల ద్వారా మంచి దిగుబడి సాధించే యంత్రాలను ఇంజినీరింగ్ విద్యార్థులు ఆవిష్కరించాలన్నారు. జాతీయస్థాయి సెమినార్లతో విద్యార్థుల ఆలోచనలు ఒకరికొకరు తెలుసుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్ మాట్లాడుతూ రెండూ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారని, పలువురు పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారని, భవిష్యత్తులో ఇలాంటి జాతీయ సెమినార్లను ఇంకా నిర్వహిస్తామని చెప్పారు. హెచ్ఓడీలు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సత్యవాణి, పుష్పలత పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

దర్శి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ సోముదుర్గారెడ్డి ఆరు సైకిళ్లు పంపిణీ చేశారు. చింతలపాలెం నుంచి దర్శికి రావాలంటే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. హెచ్ఎం ఖాదర్ మస్తాన్, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దుర్గారెడ్డి